GHMC hmda Growing Global TS-bPASS
MAKAM GANGADHAR NETHA
President (GHMC)
Telangana Building Planners Association
E-mail ID : sriswamiplanners@gmail.com

SRI SWAMI ASSOCIATES
ARCHITECTS•ENGINEERS•SURVEYORS
We Undertake Building Plans, Lay-Out Plans & Permissons, LRS, BRS, Tax Assesments

వాస్తుకి బిల్డింగ్ ప్లానింగ్, నక్ష చేయబడును
డిజిటల్ లాండ్స్ సర్వే, లే-అవుట్లు,
నక్ష ప్లానింగ్ చేయబడును,
Auto DCR Online Up Loading, Pre DCR Cad Drawing
భవన నిర్మాణ దరఖాస్తు కొరకు సంప్రదించండి.

GHMC, HMDA, DTCP, TS-bpass - Layout`s, Building Permissions
H.No. 11-5-565, Bhagya Laxmi Towers, Opp: GHMC Circle Office, Saroornagar, Hyderabad - 500035
Mob : 9393929595

క్రైమ్ మిర్రర్ ®
Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు
మంగళవారం 1-09-2026 | పబ్లిషింగ్ సెంటర్ : హైదరాబాద్



2లో

## బీజేపీ రాష్ట్ర కార్యాలయంపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం



**గండిపేట(క్రైమ్ మిర్రర్):** నాంపల్లిలోని బీజేపీ తెలంగాణ రాష్ట్ర కార్యాలయంపై యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు చేసిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు అత్తాపూర్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు సుల్గే వెంకటేష్ తెలిపారు. ప్రజాస్వామ్యంలో భిన్నాభిప్రాయాలు సహజమేనని, అయితే రాజకీయ విభేదాలకు దాడులు, బెదిరింపులు పరిష్కారం కాదని ఆయన అన్నారు. భావజాలాన్ని భావజాలంతోనే ఎదుర్కోవాలని, దాడులకు పాల్పడటం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని పేర్కొన్నారు. బీజేపీ కార్యాలయాలపై దాడులు చేసి కార్యకర్తలను భయపెట్టగలమని ఎవరైనా భావిస్తే అది వారి భ్రమ మాత్రమేనని వెంకటేష్ అన్నారు. దాడులకు లొంగకుండా ప్రజాస్వామ్య పద్ధతుల్లో తమ ప్రశ్నలను కొనసాగిస్తామని స్పష్టం చేశారు. రాజకీయ విభేదాలు ఉన్నప్పటికీ చట్టపరమైన వ్యవస్థ, పరస్పర గౌరవం, ప్రజాస్వామ్య విలువలను అన్ని రాజకీయ పార్టీలు కాపాడాలని కోరారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రజాస్వామ్యాన్ని బలపరిచేది దాడులు కాదని, ప్రజల తీర్పు, చట్టబద్ధమైన పోరాటం, సుస్థిరమైన ప్రజాభిప్రాయమేనని సుల్గే వెంకటేష్ పేర్కొన్నారు.

## చౌదరిగూడలో పాముల భయం..

- పట్టించుకోని అధికారులు
- దట్టంగా పెరిగిన చెట్లు, పొదలతో ప్రజల్లో ఆందోళన
- ప్రమాదకరంగా మారిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్





2లో

# పురుగుల అన్నం ఎఫెక్ట్.. ప్రిన్సిపాల్‌పై సస్పెన్షన్ వేటు!

**విద్యార్థుల ఆరోగ్యంతో చెలగాటం సహించంకళాశాలల్లో విద్యార్థినులకు నాణ్యమైన భోజనం, పరిశుభ్రమైన వాతావరణం, అవసరమైన సౌకర్యాలు కల్పించడంలో నిర్లక్ష్యాన్ని సహించబోమని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ స్పష్టం చేశారు.**






**సంగారెడ్డి, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి, ఆగస్టు 31:** బుదేరా సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పి. శైలజను సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. కళాశాల నిర్వహణలో లోపాలు, పరిపాలనా వ్యవహారాల్లో నిర్లక్ష్యం, విద్యార్థినులకు సౌకర్యాల కల్పనలో లోపాలు, వారి పట్ల ప్రిన్సిపాల్ వ్యవహరిస్తున్న తీరుపై వచ్చిన ఫిర్యాదుల మేరకు ఈ చర్యలు తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. కలెక్టర్ ఆదేశాలతో నియోజకవర్గ ప్రత్యేక అధికారి జగదీష్, మండల ప్రత్యేక అధికారి రామాచారి, జిల్లా కోఆర్డినేటర్ కల్పన కళాశాలను సందర్శించి నిర్వహణ, సౌకర్యాలు, పరిపాలనా అంశాలను పరిశీలించి నివేదిక సమర్పించారు. నివేదికను పరిశీలించిన అనంతరం కలెక్టర్ ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేశారు. ఇదిలా ఉండగా, కళాశాలలో నాణ్యత లేని భోజనం అందిస్తున్నారని, గత నెల రోజులుగా అన్నంలో పురుగులు వస్తున్నాయని విద్యార్థులు ఆరోపిస్తూ ఆందోళన చేపట్టారు. విషయం తెలుసుకున్న తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర కార్యదర్శి రమేష్ యాదవ్ కళాశాలకు చేరుకుని విద్యార్థులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. విద్యార్థుల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని, భోజన నాణ్యతపై సమగ్ర విచారణ జరపాలని ఆయన డిమాండ్ చేశారు. కళాశాలలో డ్రైనేజీ సమస్యతో పాటు అపరిశుభ్ర వాతావరణం కూడా ఉందని రమేష్ యాదవ్ ఆరోపించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం, పరిశుభ్రమైన వాతావరణం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. విద్యార్థుల సమస్యలు పరిష్కరించే వరకు వారి తరఫున పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. రెసిడెన్షియల్ కళాశాలల్లో విద్యార్థినులకు మెరుగైన విద్యా వాతావరణం, అవసరమైన సౌకర్యాలు కల్పించడంలో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించబోమని కలెక్టర్ ప్రతీక్ జైన్ స్పష్టం చేశారు.

# చౌదరిగూడలో పాముల భయం

**గండిపేట(క్రైమ్ మిర్రర్):** శంషాబాద్ మండల పరిధిలోని చౌదరిగూడ గ్రామంలో పాముల సంచారం స్థానికులను భయాందోళనకు గురిచేస్తోంది. గ్రామంలోని పిరంగినాల ప్రాంతంలో చెట్లు, పొదలు దట్టంగా పెరిగిపోవడంతో పాములు జనావాసాల్లోకి వస్తున్నాయని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే పాములు గ్రామంలోకి రావడం ఐదోసారి అని స్థానికులు చెబుతున్నారు. రాత్రివేళ ఇళ్ల పరిసరాల్లోకి పాములు రావడంతో బయటకు వెళ్లేందుకు ప్రజలు భయపడుతున్నారు. చిన్నారులు, వృద్ధులు ఉన్న కుటుంబాలు మరింత ఆందోళన చెందుతున్నాయి. పలుమార్లు పాములను తొలగించినప్పటికీ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించలేదని వారు వాపోతున్నారు.

**చెట్లు, పొదలు తొలగించాలని డిమాండ్...**

పిరంగినాల ప్రాంతంలో పెరిగిపోయిన చెట్లు, పొదలను వెంటనే తొలగించి పరిసరాలను శుభ్రంగా ఉంచాలని గ్రామస్తులు కోరుతున్నారు. పాములు జనావాసాల్లోకి రాకుండా సంబంధిత అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

**ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్..**

మరోవైపు గ్రామంలోని మూలమలుపులో ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కూడా ప్రమాదకరంగా మారిందని స్థానికులు చెబుతున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ పిచ్చి తీగలు, చెట్లు పెరిగిపోవడంతో విద్యుత్ ప్రమాదం జరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మూలమలుపులో ఉండటంతో వాహనదారులకు ట్రాన్స్‌ఫార్మర్ సరిగా కనిపించక ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. విద్యుత్ శాఖ అధికారులు వెంటనే స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ పెరిగిన చెట్లు, పిచ్చి తీగలను తొలగించి ప్రమాద నివారణ చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# ఘనంగా ఏకశిలా ధ్వజస్తంభం ప్రథమ వార్షికోత్సవం



**రామకృష్ణాపూర్ ఆగస్టు 31 క్రైమ్ మిర్రర్ ):** సంకష్టహర చతుర్థిని పురస్కరించుకుని పట్టణంలోని శ్రీశ్రీ విజయ గణపతి దేవాలయ ప్రాంగణంలో ఏకశిలా ధ్వజస్తంభం ప్రథమ వార్షికోత్సవాన్ని సోమవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు, వేద పండితులు బూరుగుపల్లి రామకృష్ణశర్మ, రాజేందర్‌శర్మ, ఆలయ కమిటీ అధ్యక్షుడు కృష్ణమూర్తి, అయ్యప్ప గురుస్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అభయాంజనేయస్వామి, సంతోషిమాత, అయ్యప్ప ఆలయాల ఎదుట ఇటీవల నిర్మించిన నూతన షెడ్డును అర్చకుల వేదమంత్రోచ్ఛారణల మధ్య రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఆలయానికి వచ్చే భక్తులు ఎండ, వాన నుంచి రక్షణ పొందడంతోపాటు వారి సౌకర్యార్థం హనుమాన్ భక్త బృందం ఆధ్వర్యంలో దాతల సహకారంతో షెడ్డును నిర్మించినట్లు అయ్యప్ప గురుస్వామి, అర్చకులు తెలిపారు. నిర్మాణానికి సహకరించిన హనుమాన్ భక్త బృందం సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో విజయ గణపతి ఆలయ కమిటీ సభ్యులు పెద్దపల్లి ఉప్పలయ్య, సీతారాంరెడ్డి, హనుమాన్ భక్త బృందం అధ్యక్షుడు దురిశెట్టి రవి, ప్రధాన కార్యదర్శి గంగుల యాదవ్, కోశాధికారి బద్రి సతీష్, ప్రచార కార్యదర్శి గోనె రాజేందర్, ఉపాధ్యక్షులు అప్పాల రవి, ముద్దసాని శ్రీనివాస్, కమిటీ సభ్యులు జంగంపల్లి లింగయ్య, శ్రావణ్, శ్రీనాథ్, పలువురు భక్తులు పాల్గొన్నారు.



# నాంపల్లి బీజేపీ కార్యాలయంపై దాడి హేయమైన చర్య

**- అభివృద్ధి చేతకాకే బీజేపీ కార్యాలయంపై దాడులు**

**- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తోకల శ్రీనివాస్‌రెడ్డి**

**గండిపేట(క్రైమ్ మిర్రర్):** నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంపై యువజన కాంగ్రెస్ నాయకులు దాడికి పాల్పడటం అత్యంత హేయమైన, ప్రజాస్వామ్య విరుద్ధమైన చర్య అని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఈ ఘటనను బీజేపీ తరఫున తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతున్న బీజేపీకి పెరుగుతున్న ప్రజా మద్దతును చూసి ఓర్వలేకే ప్రజల దృష్టిని మళ్లించేందుకు ఇలాంటి దాడులకు పాల్పడుతున్నారని ఆయన ఆరోపించారు. రాజకీయంగా ఎదుర్కొనే ధైర్యం లేక భౌతిక దాడులకు పాల్పడటం కాంగ్రెస్ నాయకుల అసహనానికి నిదర్శనమని విమర్శించారు. దాడులు, బెదిరింపులతో బీజేపీ నాయకులు, కార్యకర్తల పోరాటాన్ని అడ్డుకోలేరని శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశారు. ఎన్ని అవరోధాలు ఎదురైనా ప్రజా సమస్యలపై తమ పోరాటం కొనసాగుతుందని తెలిపారు. తెలంగాణలో శాంతియుత రాజకీయ వాతావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉందన్నారు. బీజేపీ కార్యాలయంపై దాడికి పాల్పడిన వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

# మాదకద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలి

**డ్రగ్స్ నిర్మూలనపై అవగాహన కల్పించిన పోలీసులు**

**యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో క్రైమ్ మిర్రర్:** మాదకద్రవ్యాల వినియోగం యువత భవిష్యత్తును నాశనం చేస్తుందని, డ్రగ్స్, నార్కోటిక్స్‌కు ప్రతి ఒక్కరూ దూరంగా ఉండాలని యాదగిరిగుట్ట రూరల్ సీఐ ఎం. శంకర్ సూచించారు. గుండాల పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన డ్రగ్స్ & నార్కోటిక్స్ అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని యువతకు మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలు, ఆరోగ్యంపై పడే దుష్ప్రభావాలు, భవిష్యత్తుపై వాటి తీవ్ర ప్రభావాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ ఎం. శంకర్ మాట్లాడుతూ.. మాదకద్రవ్యాల వినియోగం వ్యక్తిగత జీవితానికే కాకుండా కుటుంబం, సమాజంపై కూడా తీవ్ర ప్రభావం చూపుతుందని తెలిపారు. యువత చెడు వ్యసనాలకు ఆకర్షితులు కాకుండా విద్య, ఉపాధి, క్రీడలు, సృజనాత్మక కార్యక్రమాల వైపు దృష్టి సారించాలని సూచించారు. మాదకద్రవ్యాల వినియోగం, విక్రయాలు లేదా సరఫరాకు సంబంధించిన సమాచారం ఎవరికైనా తెలిసినట్లయితే వెంటనే పోలీసుల దృష్టికి తీసుకురావాలని కోరారు.



# ప్రతి వార్డును అభివృద్ధికి ప్రతీకగా తీర్చిదిద్దడమే లక్ష్యం

**రూ.3.40 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన**

**ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి**



పటాన్‌చెరు, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి ఆగస్టు 31: ఇస్నాపూర్ మున్సిపాలిటీలోని ప్రతి వార్డును సమగ్రంగా అభివృద్ధి చేసి, ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యమని పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. సోమవారం ఇస్నాపూర్, చిట్కుల్, లకడారం వార్డుల్లో రూ.3.40 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రహదారులు, డ్రైనేజీలు, పారిశుద్ధ్యం తదితర మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. ప్రజల అవసరాలు, విజ్ఞప్తుల మేరకు పనులను ప్రాధాన్యత క్రమంలో చేపడుతున్నామని పేర్కొన్నారు. శంకుస్థాపన చేసిన పనులను నాణ్యతా ప్రమాణాలతో వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సుమలత శ్రీకాంత్, మాజీ జెడ్పీటీసీ శ్రీకాంత్ గౌడ్, మాజీ ఎంపీపీ శ్రీశైలం యాదవ్, కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# ఆర్టీసీ బస్టాండ్ లో సీసీ బెడ్డు పనుల్లో నాణ్యత పాటించాలి

**నిర్మాణ పనులను పరిశీలించిన మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్**

వనపర్తి ఆగస్టు 31 క్రైమ్ మిర్రర్: పెబ్బేరు పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు ఆవరణలో చేపడుతున్న సీసీ బెడ్డు నిర్మాణ పనులను మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్, వైస్ చైర్మన్ సుమిత్ర ఎల్లారెడ్డి, స్థానిక కౌన్సిలర్లు పర్వీన్ షకీల్, జములమ్మలతో కలిసి వారు పరిశీలించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ పనుల్లో ఎలాంటి లోపాలు లేకుండా నిబంధనల ప్రకారం కాంక్రీట్ మిశ్రమాన్ని ఉపయోగించాలని సంబంధిత కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. బస్సుల రాకపోకలకు, ప్రయాణికుల రాకపోకలకు ఆటంకం కలగకుండా పనులను నిర్ణీత గడువులోగా వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సునీల్ రెడ్డి,కాంట్రాక్టర్ కృష్ణ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.




# హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం



క్రైమ్ మిర్రర్,మంగపేట: కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో పూర్తిగా విఫలం అయిందని బీఆర్ఎస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు కుదుముల లక్ష్మీ నారాయణ ఆరోపించారు.సోమవారం మండల కేంద్రంలో కుదుముల లక్ష్మీ నారాయణ అధ్యక్షతన ముఖ్య కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా కుదుముల లక్ష్మీ నారాయణ మాట్లాడుతూ హామీల అమలు వైఫల్యాలను ప్రజల్లో చర్చకు తీసుకెళ్లేందుకు సెప్టెంబర్ 2 నుంచి 8వ తేదీ వరకు నిర్వహించనున్న బీఆర్ఎస్ సమరభేరి కార్యక్రమాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారెంటీలు, 420 హామీలను ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు అమలు చేయలేదని విమర్శించారు.కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రతి గడపగడపకు తీసుకెళ్లి ప్రజలకు వివరించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న నిరసన కార్యక్రమాలను మండలంలోని నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో విజయవంతం చేయాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిన తీరును ప్రజలకు వివరించి, ప్రభుత్వంపై ప్రజాస్వామ్య పద్ధతిలో పోరాటం చేయాలని పార్టీ శ్రేణులు ఐక్యంగా పనిచేసి కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలకు సూచించారు.మండలంలోని ప్రతి గ్రామంలో నిరసన కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించి, ప్రజల సమస్యలు మరియు ప్రభుత్వ హామీల అమలుపై ప్రజల తరపున ప్రశ్నించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో మండల పార్టీ మాజీ ప్రధాన కార్యదర్శి గుండేటి రాజుయాదవ్, మల్లూరు దేవస్థాన మాజీ చైర్మన్ నూతిలకంటి ముకుందం, జిల్లా సీనియర్ నాయకులు, చిలకమర్రి రాజేందర్, పప్పు వెంకట రెడ్డి, చీకుర్తి సుధాకర్, చల్లగురుగుల తిరుపతి, యాదండ్ల రాజయ్య, దంతనపల్లి నరేందర్, అయూబ్, ఇంతేహాస్ భూట్టు,గ్రామ కమిటీ మాజీ అధ్యక్షుడు నూనె లింగయ్య, ఉడుగుల శ్రీనివాస్ యాదవ్, రావుల రమణ, రొడ్డ సుదర్శన్, శ్రీను,పిఎసిఎస్ డైరెక్టర్ అచ్చ సత్యనారాయణ, మండల మహిళా మాజీ అధ్యక్షురాలు గోస్కుల లక్ష్మి, కాటూరి సుగుణ, మహిళలు, జెట్టి లక్ష్మి,యూత్ నాయకులు, కేక్కం జగదీష్, రవి,భాస్కర్, సోషల్ మీడియా వారియర్స్ బీసా సాంబయ్య,గుడివాడ శ్రీహరి, కుమార్ స్వామి,జాడి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# శిరీష మృతి పై సమగ్ర దర్యాప్తు జరపాలి



క్రైమ్ మిర్రర్,మంగపేట: హైదరాబాద్ తుక్కుగూడలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో నర్సుగా పనిచేస్తున్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ములకలపల్లి మండలానికి చెందిన ఆదివాసీ యువతి శిరీష అనుమానాస్పద స్థితిలో మృతి చెందడంపై ములుగు జిల్లా పెసా అధ్యక్షుడు దబ్బుల ముత్యాలరావు తీవ్ర దిగ్భ్రాంతి, ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై ప్రభుత్వం తక్షణమే స్పందించి నిష్పక్షపాతంగా, సమగ్ర దర్యాప్తు జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుటుంబానికి ఆసరాగా ఉండేందుకు, ఉన్నత భవిష్యత్తు కోసం స్వగ్రామాన్ని విడిచి నగరానికి వెళ్లిన ఆదివాసీ బిడ్డ అనుమానాస్పద స్థితిలో ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమన్నారు. శిరీష మృతికి దారితీసిన కారణాలను విచారించాలని ఘటన సమయంలో చోటుచేసుకున్న సంఘటనలు అధికారులు క్షుణ్ణంగా పరిశీలించాలని కోరారు.ఒత్తిళ్లకు తలొగ్గకుండా ఘటనపై పారదర్శక దర్యాప్తు జరిపి నిజాలను బహిర్గతం చేయాలని విచారణలో దోషులు ఎంతటి వారైనా చట్టప్రకారం కఠినంగా శిక్షించాలని కోరారు.ప్రైవేట్ ఆసుపత్రులు,ఇతర సంస్థల్లో పనిచేసే మహిళా ఉద్యోగుల రక్షణకు పటిష్టమైన భద్రతా చర్యలు అమలు చేయాలని, తీవ్ర విషాదంలో మునిగిపోయిన శిరీష కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ?బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు ఆదివాసీ సమాజం తరపున పోరాటం కొనసాగిస్తామని వారికి ఎల్లవేళలా అండగా ఉంటామని అన్నారు.

# బుదేరా మహిళా డిగ్రీ కళాశాలలో పురుగుల అన్నం..?

**విద్యార్థుల ఆరోగ్యంతో చెలగాటమా.. బాధ్యులపై చర్యలు తీసుకోవాలి: రమేష్ యాదవ్**

సంగారెడ్డి, క్రైమ్ మిర్రర్ ఆగస్టు 31: బుదేరాలోని మహిళా డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు నాణ్యత లేని భోజనం అందిస్తున్నారంటూ విద్యార్థులు ఆందోళన చేపట్టారు. గత నెల రోజులుగా భోజనంలో పురుగులు వస్తున్నాయని విద్యార్థులు ఆరోపించారు. విషయం తెలుసుకున్న తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర కార్యదర్శి రమేష్ యాదవ్ కళాశాలకు చేరుకుని విద్యార్థులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రమేష్ యాదవ్ మాట్లాడుతూ.. విద్యార్థులకు పురుగులు పట్టిన అన్నం అందుతున్నట్లు వారు ఆవేదన వ్యక్తం చేయడం తీవ్ర ఆందోళన కలిగించే విషయమన్నారు. విద్యార్థుల ఆరోగ్యంతో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కళాశాల యాజమాన్యంపై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. “ఎమ్మెల్యేలు, ఎంపీలు, ముఖ్యమంత్రి ఇలాంటి అన్నం తింటారా?” అంటూ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. పేద విద్యార్థులు ప్రభుత్వ కళాశాలల్లో చదువుకుంటున్నందుకు వారికి కనీసం నాణ్యమైన భోజనం కూడా అందించలేని పరిస్థితి ఎందుకు వచ్చిందని నిలదీశారు. కళాశాలలో డ్రైనేజీ సమస్య కూడా తీవ్రంగా ఉందని, అపరిశుభ్ర వాతావరణంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వెంటనే డ్రైనేజీ సమస్యను పరిష్కరించి పరిశుభ్రమైన వాతావరణం కల్పించాలని కోరారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని, కళాశాల ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యార్థుల సమస్యలు పరిష్కారమయ్యే వరకు తెలంగాణ రాజ్యాధికార పార్టీ వారి పక్షాన పోరాటం కొనసాగిస్తుందని రమేష్ యాదవ్ స్పష్టం చేశారు. కార్యక్రమంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ మునిపల్లి మండల అధ్యక్షుడు నరేష్, యూసుఫ్ తదితరులు పాల్గొన్నారు.



# వరుస చోరీలు కావు.. ప్రజలు ఆందోళన చెందవద్దు

**ఒకే రోజు మూడు ఇళ్లలో చోరీలు.. ఆలస్యంగా వెలుగులోకి రావడంతో వేర్వేరు తేదీల్లో ఫిర్యాదులు**

**నిందితుల కోసం మూడు ప్రత్యేక బృందాలతో గాలింపు.. త్వరలోనే పట్టుకుంటాం -ఎస్ఐ రాంబాబు**




**మర్రిగూడ(క్రైమ్ మిర్రర్):** మండలంలోని శివన్నగూడెం, ఖుదాబక్ష్‌పల్లి గ్రామాల్లో తాళం వేసి ఉన్న మూడు ఇళ్లలో చోరీలు జరిగిన ఘటనలపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. మూడు ఇళ్ల యజమానులు వేర్వేరు రోజుల పాటు దూర ప్రాంతాల్లో ఉండటంతో, చోరీలు జరిగిన విషయం ఆలస్యంగా వారి దృష్టికి రావడం, అనంతరం వేర్వేరు తేదీల్లో పోలీసులకు ఫిర్యాదులు అందడంతో, మండలంలో వరుస చోరీలు జరుగుతున్నాయనే ప్రచారం జరుగుతోంది. అయితే మూడు ఘటనలు ఒకే రోజు జరిగినట్లు ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైందని, వరుసగా చోరీలు జరుగుతున్న పరిస్థితి లేదని మర్రిగూడ ఎస్ఐ రాంబాబు స్పష్టం చేశారు. శివన్నగూడెం గ్రామానికి చెందిన చిలుకూరి యాదయ్య కుటుంబం ఈ నెల 25న హైదరాబాద్‌కు వెళ్లారు. ఈ నెల 28న ఇంటి పక్కన ఉన్న వారు పరిసరాలను గమనించి యాదయ్యకు సమాచారం అందించారు. దీనితో ఆయన ఇంటికి చేరుకుని పరిశీలించగా చోరీ జరిగిన విషయం గుర్తించారు. అదే గ్రామానికి చెందిన గంజి శ్రీనివాస్ కుమారుడు, కోడలు సింగపూర్ లో ఉండటంతో, వారి వద్దకు సుమారు 45 రోజుల క్రితం శ్రీనివాస్ కుటుంబం సింగపూర్ వెళ్లారు. రోజుల తరబడి ఇల్లు అప్పటి నుంచి తాళం వేసి ఉంది. ఇంటి పక్కన ఉన్న వారి ద్వారా సమాచారం అందడంతో, శ్రీనివాస్ ఇంటిని పరిశీలించగా చోరీ జరిగిన విషయం వెలుగులోకి వచ్చింది. ఖుదాబక్ష్‌పల్లి గ్రామానికి చెందిన కందుకూరి వినయ్ కూడా సుమారు 25 రోజుల క్రితం హైదరాబాద్‌కు వెళ్లారు. ఆయన ఇంటికి తాళం వేసి ఉండగా చోరీ జరిగినట్లు, పక్కింటి వారు ఆయనకు సమాచారం అందించారు. ఇలా మూడు ఇళ్ల యజమానులు ఎక్కువ రోజులు ఇళ్లకు దూరంగా ఉండటంతో, చోరీలు జరిగిన సమయాన్ని వెంటనే గుర్తించే అవకాశం లేకపోయిందని పోలీసులు తెలిపారు.

**మూడు బృందాలతో దర్యాప్తు.. నిందితులపై ప్రత్యేక నిఘా**

చోరీ ఘటనలను పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నిందితులను గుర్తించి పట్టుకునేందుకు, మూడు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చర్యలు చేపట్టినట్లు ఎస్ఐ రాంబాబు తెలిపారు. చోరీలకు సంబంధించిన ఆధారాలను సేకరిస్తూ, నిందితుల కదలికలపై నిఘా పెట్టామని, వీలైనంత త్వరగా నిందితులను గుర్తించి పట్టుకుంటామని స్పష్టం చేశారు. వేర్వేరు తేదీల్లో ఫిర్యాదులు అందడంతో వరుస చోరీలుగా భావించవద్దని, మూడు ఘటనలు ఒకే రోజు చోటుచేసుకున్నట్లు ప్రాథమికంగా నిర్ధారణ అయిందని ఎస్ఐ తెలిపారు. ఈ ఘటనలను పోలీసులు తీవ్రంగా పరిగణిస్తున్నారని, నిందితులను పట్టుకునే దిశగా దర్యాప్తు వేగంగా కొనసాగుతోందని చెప్పారు.

**ప్రజల భద్రతే పోలీసుల బాధ్యత.. అప్రమత్తతతో నేరాలకు అడ్డుకట్ట**

ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఎస్ఐ రాంబాబు భరోసా ఇచ్చారు. అదే సమయంలో ప్రతి ఒక్కరూ తమ ఇళ్ల భద్రత విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎక్కువ రోజుల పాటు ఇంటికి దూరంగా వెళ్లాల్సి వచ్చినప్పుడు, ముందుగానే పోలీసులకు సమాచారం అందించాలని, ఇంటి పక్కన ఉన్న వారికి కూడా విషయాన్ని తెలియజేయాలని కోరారు. ఇళ్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం ద్వారా, అనుమానాస్పద కదలికలను గుర్తించడంతో పాటు, నేరాల దర్యాప్తులో కూడా అవి కీలక ఆధారాలుగా ఉపయోగపడతాయని తెలిపారు. పరిసర ప్రాంతాల్లో అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలు కనిపించినా, అనుమానాస్పద కదలికలు గమనించినా, డయల్ 100 కి కానీ, స్థానిక పోలీసులకు కానీ సమాచారం అందించాలని కోరారు. ప్రజలు అప్రమత్తంగా ఉండటం, పోలీసులకు సమాచారం అందించడం ద్వారా, నేరాలను మరింత సమర్థవంతంగా అడ్డుకోవచ్చని ఎస్ఐ తెలిపారు. ప్రజల క్షేమం, రక్షణ కోసం పోలీసులు నిరంతరం అందుబాటులో ఉంటారని, పోలీసులకు ప్రజలు సహకరించాలని కోరారు. ప్రస్తుతం జరిగిన చోరీలపై దర్యాప్తు కొనసాగుతోందని, నిందితులను త్వరలోనే పట్టుకుని, చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ రాంబాబు మరోసారి భరోసా ఇచ్చారు. చిలుకూరి యాదయ్య ఇంట్లో 3 తులాల బంగారు ఆభరణాలు, 12 తులాల వెండి ఆభరణాలు, రూ.11 వేల నగదు, గంజి శ్రీనివాస్ ఇంట్లో 35 తులాల వెండి ఆభరణాలు, నాలుగు చేతి గడియారాలు, కందుకూరి వినయ్ ఇంట్లో 2 తులాల బంగారు ఆభరణాలు, 35 తులాల వెండి ఆభరణాలు చోరీ అయినట్లు ఫిర్యాదులు అందినట్లు ఎస్ఐ తెలిపారు.

# పంటలపై రైతులకు సమగ్ర అవగాహన

**- రైతులకు వివిధ పంటల యాజమాన్య పద్ధతులపై అవగాహన**

**- చీడపీడలను సకాలంలో గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలి: వ్యవసాయ అధికారి సంపత్**



**క్రైమ్ మిర్రర్, పలిమెల ప్రతినిధి:** రైతులు శాస్త్రీయ పద్ధతులను అవలంబిస్తూ పంటలను సాగు చేయాలని, చీడపీడలను సకాలంలో గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయ అధికారి ఎ. సంపత్ సూచించారు. సోమవారం పలిమెల గ్రామంలో వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో రైతులకు సమగ్ర వ్యవసాయ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి సంపత్ రైతులకు వివిధ పంటల యాజమాన్య పద్ధతులు, చీడపీడల నివారణ, పంటల సంరక్షణ చర్యలపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా పత్తి పంటలో రసం పీల్చే పచ్చదోమ, తెల్లదోమ నివారణకు ఎకరాకు అవసరమైన మందును ఒక లీటరు నీటికి ఎసిటామిప్రిడ్ 0.2 మి.లీ. లేదా ఇమిడాక్లోప్రిడ్ 0.3 మి.లీ. చొప్పున కలిపి పిచికారీ చేసుకోవాలని సూచించారు. అలాగే ప్రస్తుతం సాగులో ఉన్న వరి పంటలో కాండం తొలుచు పురుగు నివారణకు ఎకరానికి 8 నుంచి 10 కిలోల 3జీ గుళికలను ఇసుకలో కలిపి పొలంలో సమానంగా చల్లుకోవాలని రైతులకు సూచించారు. పంటలలో చీడపీడల ఉధృతి గుర్తించిన వెంటనే వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించి, వారి సూచనల మేరకు నివారణ చర్యలు చేపట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి జి. శరత్, పలిమేల సర్పంచ్ జువ్వాజీ పుష్పలత తిరుపతి, రైతులు దందేర రాజేందర్, పడాల రమేష్, జాడి మధుసూదన్, సూరం.మహేష్ రెడ్డి పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

## విద్యార్థుల భవిష్యత్ కు బాటలు వేసేది గురువే..

**- మాజీ జెడ్పిటిసి విశాల శ్రవణ్ రెడ్డి.**



**కేశంపేట,(క్రైమ్ మిర్రర్):** దశాబ్దాల పాటు విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పుతూ, వారి ఉన్నతికి మార్గదర్శకంగా నిలిచి విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేసేది గురువే అని మాజీ జడ్పిటిసి విశాల శ్రవణ్ రెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని పాపిరెడ్డి గూడ గ్రామంలో విధులు నిర్వహిస్తున్న హైస్కూల్ హెచ్‌ఎం కోప్పునూరి శ్రీశైలం పదవీ విరమణ కార్యక్రమానికి మాజీ జెడ్పిటిసి విశాల శ్రవణ్ రెడ్డి, గ్రామ సర్పంచ్ శశిరేఖ యాదయ్య, నాయకులు, గ్రామస్తులు విద్యార్థులు పాల్గొని ఆయనకు పూలమాలలు శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా మాజీ జడ్పీటీసీ మాట్లాడుతూ విద్యార్థుల జీవితాలను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని, ఒక ఉపాధ్యాయుడిగా, ప్రధానోపాధ్యాయుడిగా శ్రీశైలం అందించిన సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. పాఠశాల అభివృద్ధికి, విద్యార్థుల ఉన్నతికి ఆయన చేసిన కృషి ఎప్పటికీ గుర్తుండిపోతుందన్నారు. శ్రీశైలం భవిష్యత్తులో మరింత సంతోషంగా ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో కేశంపేట మండల కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు రాణి, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.ద

## సిఎం సహాయనిధి పేదలకు వరం...

**- ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**

**కేశంపేట,(క్రైమ్ మిర్రర్):** సీఎం సహాయనిధి పేద ప్రజలకు వరం లాంటిదని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాలకు చెందిన 17 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో చెక్కులను అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందన్నారు.అనంతరం లబ్ధిదారులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,ఎమ్మెల్యే శంకర్ కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు హనుమగల రమేష్,కాంగ్రెస్ నాయకులు గుండ్రాతి రమణ గౌడ్,రావుల పెంటయ్య,ప్రకాష్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.






## అక్రమ మట్టి తవ్వకాలపై చర్యలు తీసుకోండి.

- అధికారులకు తెలిపిన శూన్యం.
- అధికారుల తీరుపై ప్రజావాణిలో ఫిర్యాదు.

**కేశంపేట, (క్రైమ్ మిర్రర్):** ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా ప్రభుత్వ భూమిలో మట్టితవ్వకాలపై అధికారులకు పలు మార్లు తెలిపిన పట్టించుకోవడంలేదని ఇకనైనా అక్రమ మట్టి తవ్వకాలపై చర్యలు తీసుకోవాలని ప్రజావాణిలో సోమవారం ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళితే మండల పరిధిలోని సంతాపూర్ గ్రామ శివారులోని ప్రభుత్వ భూమి 131 సర్వేనెంబర్ లో నుంచి మట్టి మాఫియా అక్రమంగా రాత్రి పూట గుట్టు చప్పుడు కాకుండా ఎలాంటి అనుమతులు లేకుండా జెసిబిల తో తోడి టిప్పర్ల ద్వారా మట్టిని మండలంతో పాటు షాద్ నగర్ వంటి ప్రాంతాలకు మట్టిని తరలిస్తున్నారని, ఎన్నిసార్లు పోలీస్, రెవెన్యూ, మైనింగ్ అధికారులకు ఫిర్యాదులు చేసిన పట్టించుకోవడం లేదని ఫిర్యాదులో వాపోయారు. ఇకనైనా సంబంధిత అధికారులు అక్రమ మట్టి వ్యాపారాన్ని పట్టించుకోని సంబంధిత వ్యక్తులపై తగిన చర్యలు తీసుకోవాలని ప్రజావాణిలో గ్రామస్తులు కోరారు. ఫిర్యాదు అందించిన వారిలో అశోక్,షబ్బీర్,సురేష్ కుమార్,లింగం, నరేందర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

## మెగా రక్తదాన శిబిరం

**క్రైమ్ మిర్రర్,మంగపేట:** మండలంలోని రాజుపేట రైతు వేదికలో సోమవారం నేస్తం సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏటూరునాగారం ప్రభుత్వ బ్లడ్ సెంటర్ సిబ్బంది రక్తదాతల నుంచి రక్తాన్ని సేకరించారు. ఈ రక్త దాన శిబిరంలో రక్త దాతలు అధిక సంఖ్య లో పాల్గొని రక్త దానం చేయగా వారికి మంగపేట మండలం శ్రేయద ఉద్యోగుల సంక్షేమ సంఘం వారు పండ్లను పంపిణీ చేశారు. ఈ రక్త దానం శిబిరం ఏర్పాటుకు తుమ్మల బెనర్జీ కొమరం డాక్టర్ సుమతి మోహన్ బొప్పన జ్యోతి యెల్ల బోయిన రాకేష్ ఆర్థిక సహాయం అందించారు. నేస్తం సేవా ట్రస్ట్ అమిర్ మాట్లాడుతు రక్తదానం చేయడం ద్వారా ఆపదలో ఉన్న వారి ప్రాణాలను కాపాడవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంకు శ్రీ రామకృష్ణ సేవ ట్రస్ట్ చైర్మన్,బిఆర్ఎస్ యూత్ జిల్లా నాయకులు బాడిశ నాగ రమేష్ హాజరు అయ్యారు. ఈ కార్యక్రమంలో శ్రేయద ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షులు గొప్ప సమ్మారావు, ప్రధాన కార్యదర్శి చెంచయ్య, ఏటూరునాగారం బ్లడ్ బ్యాంకు సిబ్బంది నిర్మల,మురళి,వైష్ణవ్ అటెండర్ సంపత్ గ్రామస్తులు జై భీమ్ రామ్ మోహన్, యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.




# డబుల్ బెడ్ రూమ్ సమస్యల పరిష్కారానికి వోడ్నాల శ్రీనివాస్ చొరవ






లబ్ధిదారుల సమస్యలు తెలుసుకొని... అధికారులతో కలిసి క్షేత్రస్థాయి పరిశీలన

**రామకృష్ణాపూర్ ఆగస్టు 31 ( క్రైమ్ మిర్రర్):** క్యాతన్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలోని డబుల్ బెడ్రూం ఇళ్ల సముదాయాన్ని గృహ నిర్మాణ శాఖ ఏఈ సాయిరామ్, మున్సిపల్ ఏఈ అశ్రితతో కలిసి కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు వోడ్నాల శ్రీనివాస్ పరిశీలించారు. ఇటీవల డబుల్ బెడ్రూం ఇళ్ల సముదాయాన్ని సందర్శించిన వోడ్నాల శ్రీనివాస్.. అక్కడ లబ్ధిదారులు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించారు. వాటిని క్షేత్రస్థాయిలో పరిష్కరించేందుకు సోమవారం సంబంధిత అధికారులతో కలిసి డబుల్ బెడ్రూం ఇళ్ల సముదాయాన్ని పునఃసందర్శించారు. ఈ సందర్భంగా కాలనీలో అంతర్గత సీసీ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థను పరిశుభ్ర పరచాలని లబ్ధిదారులు కోరారు. ఆవరణలో పెరిగిన పిచ్చిమొక్కలను తొలగించాలని, దెబ్బతిన్న సింటెక్స్ ట్యాంకుల స్థానంలో కొత్త ట్యాంకులు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. సెప్టిక్ ట్యాంకులపై మూతలు ఏర్పాటు చేయడంతోపాటు ప్రతి ఇంటికీ నల్లా ద్వారా తాగునీటి సౌకర్యం కల్పించాలని కోరారు. లబ్ధిదారుల విజ్ఞప్తులపై సానుకూలంగా స్పందించిన వోడ్నాల శ్రీనివాస్ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. నివాసితులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా వెంటనే అక్కడ ఉన్న సమస్యలను పరిష్కరించాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో డబుల్ బెడ్ రూమ్ లబ్ధిదారులు దండు సదానందం, బిసా శ్రీనివాస్, బండారి సత్యనారాయణ, అనంతుల రవి, చాంద్ పాషా తదితరులు పాల్గొన్నారు.

# రామకృష్ణాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఏసీపీ ఆకస్మిక తనిఖీ

పెండింగ్ కేసులు త్వరగా పరిష్కరించాలని ఆదేశం

**రామకృష్ణాపూర్: ఆగస్టు 31 (క్రైమ్ మిర్రర్):** రామగుండం పోలీస్ కమిషనరేట్ మంచిర్యాల జోన్ పరిధిలోని రామకృష్ణాపూర్ పోలీస్‌స్టేషన్‌ను బెల్లంపల్లి ఏసీపీ కిరణ్‌కుమార్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్‌స్టేషన్ పనితీరు,కేసుల దర్యాప్తు పురోగతి, ప్రజలకు అందుతున్న పోలీసు సేవలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్ పరిసరాలను పరిశీలించి పరిశుభ్రత పాటించాలని సూచించారు. వివిధ కేసుల్లో స్వాధీనం చేసుకున్న వాహనాలను క్రమబద్ధంగా ఉంచాలని ఎస్ఐ శ్రీధర్‌ను ఆదేశించారు. రిసెప్షన్ కేంద్రాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించి, వారి సమస్యలను చట్టపరిధిలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. స్టేషన్‌లో నమోదైన కేసులు, దర్యాప్తు పురోగతి, పెండింగ్ కేసుల వివరాలను పరిశీలించిన ఏసీపీ.. పెండింగ్ కేసులను త్వరగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. వివిధ రికార్డులు, రిజిస్టర్లను తనిఖీ చేశారు. ఎస్ఐ, స్టేషన్ రైటర్, సీసీటీఎన్ఎస్ రైటర్లతో మాట్లాడి కేసుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయడం, రికార్డులను సక్రమంగా అప్‌లోడ్ చేయడంపై ఆరా తీశారు. ఈ తనిఖీలో మందమర్రి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పి.రమేష్ తదితరులు పాల్గొన్నారు.







# పెగడపల్లి మండల వడ్డెర కులస్తుల నూతన కమిటీ



**క్రైమ్ మిర్రర్,పెగడపల్లి :** జగిత్యాల జిల్లా పెగడపల్లి మండలం కేంద్రంలో ధర్మపురి నియోజకవర్గ వడ్డెర కులస్తుల నియోజకవర్గ కమిటీ, జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పెగడపల్లి మండల వడ్డెర కులస్తుల నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా నియోజకవర్గస్థాయి అధ్యక్షులు జిల్లా స్థాయి అధ్యక్షులు మండల స్థాయి అధ్యక్షులు మాట్లాడుతూ తమరు గత ప్రభుత్వంలో ఎవరు పట్టించుకోలేదని అన్ని రంగాల్లో తమను చిన్నచూపు చూస్తున్నారని తమకు అన్ని రకాల సంక్షేమ ఫలాలు అందాలని తమను బీసీ జాబితా నుండి ఎస్టి జాబితాలోకి మార్చాలని ప్రస్తావించారు. ఈ కార్యక్రమంలో ధర్మపురి నియోజకవర్గ అధ్యక్షులు తపాల శంకర్, జిల్లా అధ్యక్షులు బోదాసు నరసయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి బోదాసు జలంధర్, జిల్లా ప్రచార కార్యదర్శి పిట్ల వెంకటేష్, మండల అధ్యక్షులు సూర రాజేందర్, ఉపాధ్యక్షులు సురరాజు, ప్రధాన కార్యదర్శి కొమిరి లచ్చన్న, బోదాసు మల్లయ్య, మాగని బాబు, కులస్తులు పాల్గొన్నారు.



## పట్టా భూమి హద్దులు గుర్తించండి.

**- తహసిల్దార్ రాజేందర్ రెడ్డి కి వినతి**

**కేశంపేట,(క్రైమ్ మిర్రర్):** పట్టా భూమి, ప్రభుత్వ భూమికి సంబంధించి వివాదం నెలకొన్న నేపథ్యంలో తన పట్టా భూమి కొలతలు, విస్తీర్ణాన్ని నిర్ధారించే సర్వే అందించాలని కోరుతూ పట్టే దార్ సయ్యద్ బషీరుల్ హాఖ్ కేశంపేట్ మండల తహసీల్దార్‌కు వినతిపత్రం సోమవారం సమర్పించారు. మండల పరిధిలోని సంతాపూర్ గ్రామ పరిధిలోని సర్వేనెంబర్ 163 164 లో 39 గుంటల భూమి ఉన్నదని, ఈ సర్వే నెంబర్ల ప్రక్కన ప్రభుత్వ భూమి ఉన్న కారణంగా వివాదాలకు దారితీస్తుందని, రెవెన్యూ అధికారులు పట్టా భూమి,ప్రభుత్వ భూమి మధ్య ఖచ్చితమైన హద్దులను గుర్తించి అధికారికంగా సర్వే నిర్వహించి తమకు న్యాయం చేయాలని తహసిల్దార్ ను కోరారు. ఇదే విషయమై గతంలో అధికారులకు వినతి పత్రాన్ని అందించామన్నారు. ఈ విషయంపై రెవెన్యూ అధికారులు స్పందించి త్వరితగతిన సర్వే నిర్వహించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కొంతమంది ఈ విషయంపై అనవసరమైన ఆరోపణలు చేస్తున్నారని అధికారిక సర్వే ద్వారా వాస్తవాలు వెలుగులోకి వస్తాయని ఆయన పేర్కొన్నారు.

## ప్రజావాణికి 7 అర్జీలు

**రెవెన్యూకు 5.. మున్సిపాలిటీకి 2**

**మందమర్రి, ఆగస్టు 31 (క్రైమ్ మిర్రర్):** మండల ప్రజల సమస్యల పరిష్కారం కోసం మందమర్రి ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 7 అర్జీలు అందాయి. ఎంపీడీవో రాజేశ్వర్ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి వివిధ శాఖలకు చెందిన 19 మంది అధికారులు హాజరయ్యారు. వచ్చిన ఏడు వినతుల్లో రెవెన్యూ శాఖకు సంబంధించిన 5 అర్జీలను తహసీల్దార్ సతీష్‌కు, మందమర్రి మున్సిపాలిటీకి సంబంధించిన రెండు అర్జీలను మున్సిపల్ కమిషనర్‌కు పంపించారు.ప్రజలు తమ సమస్యలను ప్రజావాణి ద్వారా అధికారుల దృష్టికి తీసుకురావాలని ఎంపీడీవో రాజేశ్వర్ సూచించారు. అందిన వినతులపై అధికారులు త్వరితగతిన స్పందించి పరిష్కరించాలని ఆదేశించారు.



# పశువైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి..


**సర్పంచ్ కొట్టం నరేందర్ రెడ్డి.**

**కేశంపేట,(క్రైమ్ మిర్రర్):** రైతులు పశువుల ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని ఉచిత పశువైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని గ్రామ సర్పంచ్ కొట్టం నరేందర్ రెడ్డి సూచించారు. సోమవారం మండల పరిధిలోని మంగళి గూడ గ్రామంలో కొత్తపేట క్లస్టర్ పశు వైద్యాధికారి ఎం.సబితా రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత పశు వైద్య శిబిరానికి,ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామంలోని పాడి రైతులుకు పశువుల ఆరోగ్యం బాగుంటేనే మెరుగైన ఆదాయం లభిస్తుందని,పశువులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి,చూడి నిలవని పశువులకు,ఎదకు రాని పశువులకు ఎదకు వచ్చే విధంగా అవసరమైన చికిత్సలు అందిస్తున్నట్లు తెలిపారు.దూడలకు ఉచితంగా నట్టల నివారణ మందులను పంపిణీ చేశారని, ఇలాంటి వైద్య శిబిరాలను నిర్వహించడం ద్వారా పాడి రైతులకు మేలు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ రాధాకృష్ణ, పశువైద్య సిబ్బంది సీహెచ్.సామయ్య, గోపాలమిత్ర సూపర్వైజర్ బండ వెంకటేష్, గోపాలమిత్రులు డి.రమేష్, జి.సంతోష్ కుమార్, రాజు, బుచ్చిలింగం, పాడి రైతులు కె.విజేందర్ రెడ్డి, లక్ష్మీకాంత్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, జైపాల్ రెడ్డి, బాలయ్య, సుక్క యాదయ్య, సుక్క వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా శ్రీ లక్ష్మీ గణపతి స్వామి వార్షికోత్సవం





**రామకృష్ణాపూర్ ఆగస్టు 31 (క్రైమ్ మిర్రర్):** రామకృష్ణాపూర్ ఏరియా ఆసుపత్రి ఆవరణలోని లక్ష్మీ గణపతి స్వామి 9వ వార్షికోత్సవ వేడుకలు సోమవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగాయి. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అధికారులు, వైద్యులు, సిబ్బంది పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఉదయం నుంచే ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, శాస్త్రోక్తంగా హోమ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో మందమర్రి ఏరియా అధికారులు, డాక్టర్లు, సిబ్బంది పాల్గొని స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ వేడుకలను సీఎమ్ఓ కిరణ్ రాజ్, మందమర్రి ఏరియా జీ ఎం ఎన్. రాధాకృష్ణల సహాయ సహకారాలతో పాటు ఆలయ కమిటీ సభ్యులు డీవై సీఎమ్ఓ ఎం. మధుకుమార్, సీనియర్ పిఓ ఎమ్డి మదర్ సాహెబ్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ మేకల రాజయ్య, సభ్యులు ఎం. జమదగ్ని, రాయల శ్రీనివాస్, భరత్ తిరుపతి, రమేష్, రఘు, శ్రీధర్, శ్రీకాంత్, టి. విజయలక్ష్మి, పుష్ప, సరోజ, సులోచన, ప్రమీలల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమం విజయవంతానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# స్థానిక ప్రజా సమస్యలు పరిష్కరించాలంటూ సిపిఎం ధర్నా




**బాలాపూర్ (క్రైమ్ మిర్రర్):** అర్హులైన వారందరికీ ఇండ్లస్థలాలు, ఇండ్లు, రేషన్ కార్డులతోపాటు గుంతల మయంగా మారిన రోడ్లకు మరమ్మత్తులు, వృద్ధులకు 4 వేలు, వికలాంగులకు 6వేలకు పెన్షన్లు పెంచుతామని ఇచ్చిన హామీ, డ్రైనేజ్ సమస్య, బడంగ్ పేట్ టెలిఫోన్ ఎక్సంజ్ కాలనీ లోని 153 సర్వే నెంబర్లోని స్మశానవాటికని110 సర్వే నెంబర్కు మార్చి స్థానిక ప్రజల ఆరోగ్యాలు కాపాడాలని కోరుతూ సిపిఎం బాలాపూర్ మండల కమిటీ ఆధ్వర్యంలో బడంగ్ పేట మున్సిపల్, ఎమ్మార్వో కార్యాలయం ముందు ధర్నా చేయడం జరిగింది. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు బాలాపూర్ మండల ఇంచార్జి గోరెంకల నర్సింహా మాట్లాడుతూ పెన్షన్ల విషయంలో ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని, స్థానికంగా నెలకొన్న ఇతర సమస్యలకు పరిష్కారం చూపాలంటూ, బడంగ్పేట్ సర్కిల్ పరిధిలో కబ్జాకు గురైన చెరువులు, కుంటలను స్వాధీనం చేసుకొని సుందరికరణ చేపట్టాలంటు డిప్యూటీ కమిషనర్ సమ్మయ్య కి వినతి పత్ర రూపంలో కోరడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కమిటీ సభ్యులు దాసరి బాబు, శేఖర్ యాదవ్, సుంకోజు యాదగిరిచారి, మహిళా నాయకురాలు ఇందిర, అరుణ, నాయకులు నీలం వెంకయ్య, దాసరి నర్సింహా, ధన్నాసి మల్లికార్జున్, ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షులు దాసరి అరవింద్, వల్లపోలు నర్సింహా భూరాన్, ఆదాము, జగన్, ఫిటర్ తదితరులు పాల్గొన్నారు.



## కూకట్‌పల్లిలో కెపిహెచ్బి ఐరిస్ బిల్డింగ్ లో ఘనంగా “షీ డిజైనర్ స్టూడియో గ్రాండ్ ప్రారంభం

**మహిళల అవసరాలకు అనుగుణంగా అత్యాధునిక ఫ్యాషన్, డిజైనర్ వేర్ అందిస్తుంది**

**కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్, టీపీసీసీ ఉపాధ్యక్షులు బండి రమేష్**

**కూకట్‌పల్లి, ఆగస్టు 31 (క్రైమ్ మిర్రర్) :** మహిళల అవసరాలకు అనుగుణంగా అత్యాధునిక ఫ్యాషన్, డిజైనర్ వేర్ అందించే “షీ డిజైనర్ స్టూడియో” గ్రాండ్ ఓపెనింగ్ కార్యక్రమం సోమవారం కూకట్‌పల్లిలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్, టీపీసీసీ ఉపాధ్యక్షులు, తెలంగాణ కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్, ప్రత్యేక అతిథి బండి లకుమ దేవి ముఖ్య అతిథులుగా హాజరై షీ డిజైనర్ స్టూడియో ను ప్రారంభించారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ, మహిళలకు నూతన ఫ్యాషన్‌కు అనుగుణంగా నాణ్యమైన డిజైనర్ దుస్తులు, వస్త్రాలు అందించేందుకు షీ డిజైనర్ స్టూడియో ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. సంస్థ నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, వ్యాపారం విజయవంతంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్రీనివాస్ బాబు, గాదె శివ చౌదరి, రామారావు, రమణ, సంధ్య, కల్పన తదితరులు పాల్గొన్నారు.

## రూ.20 లక్షలతో చేపట్టిన భూగర్భ డ్రైనేజీ పనులను పరిశీలించిన మాజీ కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్

**బాలానగర్, ఆగస్టు 31 (క్రైమ్ మిర్రర్) :** కూకట్ పల్లి నియోజకవర్గం, ఫతేనగర్ డివిజన్ పరిధిలోని తెనుగు బస్తీలో రూ.20 లక్షల నిధులతో చేపడుతున్న భూగర్భ డ్రైనేజీ పనులను మాజీ కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ స్థానికులతో కలిసి పరిశీలించారు. కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సహకారంతో ఈ పనులు కొనసాగుతున్నాయి. గతంలో కార్పొరేటర్ గా ఉన్న సమయంలో పాదయాత్ర చేసినప్పుడు స్థానికుల విజ్ఞప్తి మేరకు రోడ్డు మంజూరు చేయించడం జరిగిందని, అదే సమయంలో డ్రైనేజీ వ్యవస్థను కూడా నూతన పైప్ లైన్ వేయాలని స్థానికులు కోరడంతో ప్రతిపాదనలు తీసుకుని పనులు ప్రారంభించడం జరిగిందని సతీష్ గౌడ్ తెలిపారు. జలమండలి మేనేజర్ హిమజ, స్థానికులతో కలిసి జరుగుతున్న పనుల నాణ్యతను పరిశీలించి, పనులు త్వరగా, నాణ్యతతో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మహేష్ యాదవ్, శ్యామ్ గౌడ్, కంచి కమల్ యాదవ్, సూపర్వైజర్ సాయి, బస్తీ వాసులు పాల్గొన్నారు.



# కార్మిక సమస్యల పరిష్కారానికి చొరవ

**ఏఐటీయూసీ 21వ స్ట్రక్చర్ సమావేశం.. సమస్యలను యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని అధికారులకు జీఎం ఆదేశం**

**మందమర్రి, ఆగస్టు 31 (క్రైమ్ మిర్రర్) :** సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారానికి యాజమాన్యం చొరవ చూపింది. మందమర్రి ఏరియా జీఎం ఎన్.రాధాకృష్ణ అధ్యక్షతన సోమవారం జీఎం కార్యాలయ కాన్ఫరెన్స్ హాల్‌లో ఏఐటీయూసీతో 21వ స్ట్రక్చర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏరియాలోని గనులు, వివిధ విభాగాల్లో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను యూనియన్ నాయకులు జీఎం దృష్టికి తీసుకెళ్లారు. గనుల్లో సేఫ్టీ మెటీరియల్, డ్రిల్ రాడ్లు, బిట్లు, రూఫ్ బోల్ట కొరతను తీర్చాలని కోరారు. కేకేఓసీలో కన్వేయర్ బెల్ట్‌కు ఇరువైపులా పేరుకుపోయిన షేల్ కుప్పలను తొలగించాలని సూచించారు. ఏరియా స్టోర్స్‌లో ఖాళీగా ఉన్న టెండాల్, టెండాల్ సూపర్‌వైజర్, ఎస్కార్ట్ డ్రైవర్, లోడింగ్, అన్‌లోడింగ్ జనరల్ అసిస్టెంట్ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. దెబ్బతిన్న ఆస్బెస్టాస్ షీట్ల స్థానంలో ఐరన్ రూఫింగ్ ఏర్పాటు చేయాలని, కంప్యూటర్లు, రికార్డులకు రక్షణ కల్పించాలని విజ్ఞప్తి చేశారు. రామకృష్ణాపూర్ ఏరియా ఆసుపత్రి డిస్పెన్సరీలో కార్మికులకు అవసరమైన మందులన్నీ అందుబాటులో ఉంచాలని కోరారు. ఎస్అండ్‌పీసీ విభాగంలో సెక్యూరిటీ గార్డులకు కొత్త యూనిఫాం, షూస్, కిట్లు అందించాలని, మొబైల్ చెక్‌పోస్టులు ఏర్పాటు చేయాలని తెలిపారు. చెక్‌పోస్టుల వద్ద బుష్ కటింగ్ చేయడంతో పాటు పాత ఫర్నిచర్ స్థానంలో కొత్త కుర్చీలు, టేబుళ్లు ఏర్పాటు చేయాలని కోరారు. గనులు, విభాగాల్లో ఖాళీగా ఉన్న ఆఫీస్ అటెండెంట్ పోస్టులను భర్తీ చేయాలని యూనియన్ ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు.



**అధికారులకు జీఎం ఆదేశం**

యూనియన్ నాయకులు ప్రస్తావించిన సమస్యలపై జీఎం ఎన్.రాధాకృష్ణ సానుకూలంగా స్పందించారు. అర్హత ఉన్న పనులను యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ఉత్పత్తి లక్ష్యాల సాధనలో కార్మికులు, కార్మిక సంఘాలు అందిస్తున్న సహకారం అభినందనీయమన్నారు. సింగరేణి అభివృద్ధి, ఉత్పత్తి,ఉత్పాదకత సాధనలో కార్మిక సంఘాల పాత్ర కీలకమని పేర్కొన్నారు. ఉత్పత్తితో పాటు కార్మికుల సంక్షేమానికి సంస్థ ప్రాధాన్యం ఇస్తుందని తెలిపారు. ఈ సమావేశంలో ఎస్ఓ టు జీఎం జి.ఎల్.ప్రసాద్, వివిధ విభాగాల అధికారులు, ఏఐటీయూసీ ఏరియా కమిటీ వైస్‌ప్రెసిడెంట్ సుదర్శన్, జీఎం స్ట్రక్చర్ కమిటీ సభ్యుడు రాజేశం, ఏఐటీయూసీ నాయకులు సలేంద్ర సత్యనారాయణ, దాగం మల్లేష్, అక్బర్ అలీ తదితరులు పాల్గొన్నారు.

## తెలుగు సాహితి బుక్ ఆఫ్ రికార్డ్స్ జాతీయ పురస్కారాల ప్రధానోత్సవం

**జర్నలిజంలో జాడ క్రాంతి కుమార్ కి జాతీయ పురస్కారం**

**మందమర్రి టౌన్ ఆగస్టు 31 క్రైమ్ మిర్రర్:** తెలుగు సాంస్కృతి సాహితి సేవా ట్రస్ట్, తెలంగాణ సాహితీ బుక్ ఆఫ్ రికార్డ్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్ లోని ది సిటీ పార్క్ హోటల్ లో నిర్వహించిన జాతీయ పునస్కారాల ప్రధానోత్సవ కార్యక్రమాల వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక కళలను, కళాకారులను గుర్తించి, వారికి అంతర్జాతీయ, జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకురావడమే లక్ష్యంగా తెలుగు సాంస్కృతి సాహితి సేవా ట్రస్ట్, తెలంగాణ సాహితీ బుక్ ఆఫ్ రికార్డ్స్ కృషి చేస్తున్నాయని సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ మాచవరం గౌరీ శంకర్ తెలిపారు. వివిధ రాష్ట్రాలకు చెందిన కళాకారులు, సాహితీవేత్తలు, సామాజిక సేవకులు, జర్నలిస్టులు, వివిధ రంగాల్లో విశేష సేవలందించిన ప్రముఖులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, కళా ప్రదర్శనలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. కళాకారులను నిర్వాహకులు శాలువాలతో ఘనంగా సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు. అనంతరం తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, ఒరిస్సా, మహారాష్ట్ర తదితర రాష్ట్రాలకు చెందిన ప్రతిభావంతులను వివిధ పురస్కారాలతో ఘనంగా సన్మానించారు. అదేవిధంగా పలువురికి సొసైటీ ఆధ్వర్యంలో గౌరవ డాక్టరేట్లు ప్రధానం చేశారు. ఈ వేడుకల్లో జర్నలిస్టుల విభాగంలో




మంచిర్యాల జిల్లా మందమర్రికి చెందిన జాడ క్రాంతి కుమార్ (టైమ్స్ ఆఫ్ వార్త)కు జాతీయ పురస్కారం --2026ను ప్రదానం చేసి, ఘనంగా సత్కరించారు. జాతీయ స్థాయిలో పురస్కారం అందుకున్న క్రాంతి కుమార్‌ను పలువురు జర్నలిస్టులు, మిత్రులు, స్థానికులు అభినందించారు. ఈ సందర్భంగా క్రాంతి కుమార్ మాట్లాడుతూ, తనకు లభించిన ఈ గౌరవం మరింత బాధ్యతను పెంచిందన్నారు. ప్రజలకు వాస్తవ పరిస్థితులు తెలియజేసేలా నిజాలను వెలికితీసి, నిష్పక్షపాత సమాచారాన్ని ప్రజలకు, ప్రభుత్వానికి అందించేందుకు నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథి సాహితీ స్మార్ట్ సూరేపల్లి విజయ తో నిర్వాహకులు మాచవరం గౌరీశంకర్, మాచవరం నరసింహ సాయి శ్రీనివాస్ లు పాల్గొన్నారు.

## వర్షపు నీటి కాలువ నిర్మాణ పనులను పరిశీలించిన కార్పొరేటర్ వెంకటేష్ గౌడ్

**కూకట్ పల్లి, ఆగస్టు 31 (క్రైమ్ మిర్రర్) :** శేరిలింగంపల్లి నియోజకవర్గం, అల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని మహంకాళి నగర్ ఆశా నగర్ హైటెన్షన్ లైన్ రోడ్డు లోని నూతనంగా నిర్మిస్తున్న వర్షపు నీటి కాలువ (బాక్స్ డ్రైన్) నిర్మాణ పనులను ఉమ్మడి ఆల్విన్ కాలనీ డివిజన్ మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ వర్షపు నీటి కాలువ నిర్మాణ పనులను నాణ్యత ప్రమాణాలతో త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు



వినియోగంలోకి తీసుకురావాలని సంబంధిత అధికారులకు తెలియచేసారు. అలాగే భవిష్యత్తులో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా డ్రైనేజీ నిర్మాణ పనులను ముందస్తు ప్రణాళికతో పూర్తి చేయాలని అన్నారు. కార్యక్రమంలో ఏఈ సాయి యుగంధర్ రెడ్డి, వర్క్ ఇన్స్పెక్టర్ రవి కుమార్, ఖలీమ్, రాహుఫ్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# కిస్మిస్, ముత్యాలు, పంచదార చిలకలతో అమ్మవారికి ప్రత్యేక దండ సమర్పణ

**భక్తిశ్రద్ధలతో శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారికి కానుక**

**వరప్రసాద్--అమ్మాణి దంపతులకు ఘన సత్కారం**



**కూకట్ పల్లి, ఆగష్టు 31 (క్రైమ్ మిర్రర్):** కూకట్ పల్లి నియోజకవర్గం ఫతేనగర్ డివిజన్ పరిధిలోని కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో భక్తిశ్రద్ధలు వెల్లివిరిశాయి. గుంటూరు జిల్లా రేపల్లెకు చెందిన వరప్రసాద్--అమ్మాణి దంపతులు అమ్మవారిపై తమకున్న భక్తిని చాటుకుంటూ ప్రత్యేకంగా తయారు చేసిన అందమైన దండను అమ్మవారికి భక్తిపూర్వకంగా సమర్పించారు. కిస్మిస్, ముత్యాలు, పంచదార చిలకలను వినూత్నంగా ఉపయోగించి ఎంతో కళాత్మకంగా రూపొందించిన ఈ ప్రత్యేక దండను అమ్మవారికి సమర్పించడం ఆలయంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. భక్తితో, శ్రద్ధతో తయారు చేసిన ఈ దండను అమ్మవారికి అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ శివపురం రామయోగి వరప్రసాద్ అమ్మాణి దంపతులను అభినందించారు. అమ్మవారికి భక్తితో ప్రత్యేక దండను తయారు చేసి సమర్పించడం అభినందనీయమని పేర్కొన్నారు. అనంతరం దంపతులకు అమ్మవారి చీరను అందజేసి, శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ శివపురం రామయోగి మాట్లాడుతూ.. భక్తులు తమ ఇష్టదైవానికి వివిధ రూపాల్లో కానుకలు సమర్పించడం ద్వారా తమ భక్తిని చాటుకుంటారని, ఇలాంటి భక్తి కార్యక్రమాలు ఆలయ ఆధ్యాత్మిక వాతావరణాన్ని మరింత పెంపొందిస్తాయని అన్నారు. అమ్మవారికి ప్రత్యేక దండ సమర్పించిన వరప్రసాద్--అమ్మాణి దంపతులకు ఆలయ నిర్వాహకులు, భక్తులు అభినందనలు తెలిపారు. అమ్మవారి ఆశీస్సులు ఆ దంపతుల కుటుంబంపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు.

# జిఎం కార్యాలయంలో ఏఐటియుసి 21వ నిర్మాణాత్మక సమీక్ష సమావేశం



**మందమర్రి టౌన్ ఆగస్టు 31 క్రైమ్ మిర్రర్:** సింగరేణి కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా, వారి పలు సమస్యల పరిష్కారానికై మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ ఎన్.రాధాకృష్ణ అధ్యక్షతన జిఎం కార్యాలయంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. గుర్తింపు కార్మిక సంఘం ఏఐటియుసి తో 21వ నిర్మాణాత్మక సమీక్షా సమావేశం అత్యంత ప్రశాంత వాతావరణంలో జరిగింది. ఈ సందర్భంగా కార్మికుల భద్రత, ఉత్పత్తి ప్రయోజనాల దృష్ట్యా యాజమాన్యం వెంటనే స్పందించి ఈ క్రింది సమస్యలను పరిష్కరించాలని యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు.మందమర్రి ఏరియా గనుల్లో సేఫ్టీ మెటీరియల్, డ్రిల్ రాడ్, బిట్లు, రూఫ్ బోల్ట్‌ల కొరత తీర్చక పోవడం వల్ల బొగ్గు ఉత్పత్తి, కార్మికుల భద్రత తీవ్రంగా దెబ్బతింటుందన్నారు. కెకెఓసి: కన్వేయర్ బెల్ట్‌కు నష్టం వాటిల్లకుండా, అది సజావుగా పనిచేసేందుకు బెల్ట్‌కు ఇరువైపులా పేరుకుపోయిన షేల్ (మట్టి/రాతి) కుప్పలను వెంటనే తొలగించాలనారు. ఎస్ ఎన్ పి సి సెక్యూరిటీ గార్డులకు కొత్త యూనిఫాం క్లాత్, షూస్, క్వాలిటీ కిట్లను అందించాలని నిర్ణీత ప్రాంతాల్లో మొబైల్ చెక్ పోస్టులను ఏర్పాటు చేయడంతో పాటు పాత ఫర్నిచర్ స్థానంలో కొత్త కుర్చీలు, టేబుళ్లను వెయ్యాలని చెక్ పోస్టుల వద్ద పిచ్చి మొక్కలను (బుష్ కటింగ్) శుభ్రం చేయించాలని అన్నారు.మందమర్రి ఏరియా గనులు, డిపార్ట్‌మెంట్లలో ఖాళీగా ఉన్న ఆఫీస్ అటెండెంట్ పోస్టులను భర్తీ చేయాలని కార్మికుల భద్రత, సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని యాజమాన్యం ఈ సమస్యలపై త్వరితగతిన సానుకూల నిర్ణయం తీసుకోవాలని యూనియన్ ప్రతినిధులు కోరారు.అలాగే సింగరేణి సంస్థ అభివృద్ధిలోనూ, ఉత్పత్తి ఉత్పాదకత సాధనలోనూ కార్మిక సంఘాల పాత్ర అత్యంత కీలకమైనదని కొనియాడారు. సంస్థ కేవలం ఉత్పత్తి లక్ష్యాలకే పరిమితం కాకుండా, ఉద్యోగుల, కార్మికుల సంక్షేమానికి అగ్రతాంబూలం ఇస్తుందని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఎస్ఓటు జీఎం జి.ఎల్. ప్రసాద్, ఏరియా ఈ అండ్ ఎం, బాలాజీ భగవతి ఝ, కే కే గ్రూప్ ఏజెంట్, ఖాదిర్, గ్రూప్ ఏజెంట్ సంతోష్ కుమార్, కేకే ఓసిపి ప్రాజెక్ట్ ఆఫీసర్ రాంబాబు, డీజీఎం పర్సనల్ అశోక్, డీజీఎం ఐఈడీ కిరణ్ కుమార్, డీజీఎం సివిల్ షేక్ మదీనా భాష, డీజీఎం ఏరియా స్టోర్స్,రవీందర్, డి జిఎం సర్వే దేశాయ్, డివై సీఎం ఓఎ హెచ్ ఆర్ కెపి మధు కుమార్, మెడికల్ సూపరింటెండెంట్ నాగేశ్వరరావు, వర్క్ షాప్ డివై ఎస్సీనరేష్, ఏ ఎస్ ఓ ఎస్ అండ్ పి సి వెంకటేశ్వర రెడ్డి, ఎస్ సిసి హెచ్ పి చంద్రమౌళి, ఆర్ ఆర్ టి ఇంచార్జ్ రామ్మోహన్, సీనియర్ పి.ఓ కార్తీక్, యూనియన్ తరపున ఏఐటియుసి, ఏరియా కమిటీ వైస్ ప్రెసిడెంట్ సుదర్శన్, ఏఐటీయూసీ జిఎం స్ట్రక్చర్ కమిటీ మెంబర్ రాజేశం, ఇతర సీనియర్ అధికారులు, కార్మిక సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# నేపాల్ వరదల్లో మణికొండ వాసి గల్లంతు

**ధన్‌పాల్‌రెడ్డి ఆచూకీ కోసం కుటుంబ సభ్యుల ఆందోళన**

**ప్రభుత్వ సాయం కోరుతున్న కుటుంబం**



**గండిపేట(క్రైమ్ మిర్రర్):** నేపాల్‌లో భారీ వర్షాలు, వరదలతో జనజీవనం అస్తవ్యస్తమైన వేళ హైదరాబాద్ మణికొండకు చెందిన ధన్‌పాల్‌రెడ్డి గల్లంతైన ఘటన ఆ కుటుంబంలో తీవ్ర ఆందోళనకు దారితీసింది. నేపాల్ పర్యటనకు వెళ్లిన ధన్‌పాల్‌రెడ్డి నుంచి చివరిసారిగా ఫోన్‌లో మాట్లాడిన తర్వాత ఎలాంటి సమాచారం లేకపోవడంతో కుటుంబ సభ్యులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. 15 రోజుల ట్రిప్‌లో భాగంగా ధన్‌పాల్‌రెడ్డి ఈ నెల 23వ తేదీన ఆదివారం నేపాల్‌కు బయలుదేరారు. ఓ ట్రావెల్ ఏజెన్సీ ద్వారా సుమారు 60 మంది పర్యటనకు వెళ్లినట్లు సమాచారం. అయితే నేపాల్‌లో ప్రకృతి విపత్తు, భారీ వరదల పరిస్థితుల నేపథ్యంలో ఆయనతో సంబంధాలు తెగిపోయినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ధన్‌పాల్‌రెడ్డితో చివరిసారిగా మంగళవారం ఫోన్‌లో మాట్లాడినట్లు కుటుంబ సభ్యులు చెబుతున్నారు. ఆ తర్వాత ఆయన నుంచి ఎలాంటి సమాచారం లేకపోవడంతో ఆందోళన మరింత పెరిగింది. నేపాల్‌లో నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో ఆయన సురక్షితంగా ఉన్నారా అనే విషయంపై కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ధన్‌పాల్‌రెడ్డి క్షేమంగా తిరిగి రావాలని కుటుంబ సభ్యులు ఆకాంక్షిస్తున్నారు. ఆయన ఆచూకీని వీలైనంత త్వరగా గుర్తించేందుకు తెలంగాణ ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం, సంబంధిత అధికారులు మరియు భారత రాయబార కార్యాలయం సహాయం అందించాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు. ధన్‌పాల్‌రెడ్డి సురక్షితంగా కుటుంబ సభ్యుల వద్దకు చేరేలా అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



# సెప్టెంబర్ 09న వరంగల్ లో ఎమ్మార్పీఎస్ జాతీయ స్థాయి శిక్షణ తరగతులు - విజయవంతం చేయాలి...

**పద్మశ్రీ మందకృష్ణ మాదిగ**

**క్రైమ్ మిర్రర్ కొండాపూర్:** సెప్టెంబర్ 09న వరంగల్ లో జాతీయ స్థాయిలో జరిగే ఎమ్మార్పీఎస్ మండల కమిటీల శిక్షణ తరగతుల సభను విజయవంతం చేయాలని, నూతన కమిటీల నిర్మాణం చేపట్టాలని పద్మశ్రీ మందకృష్ణ మాదిగ పిలుపునిచ్చారు. ఈ మేరకు హైదరాబాద్ లో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు ఐత రమేష్ మాదిగ, కొండాపూర్ అధ్యక్షులు జగపతి అంజయ్య మాదిగ, శేరిలింగంపల్లి ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు సింగదాసరి నరేష్ మాదిగ, సింగదాసరి రాజు మాదిగ అంజయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మందకృష్ణ మాదిగ గారిని శాలువాతో ఘనంగా సన్మానించారు.

# హైదర్‌షాకోట్‌లో అర్ధరాత్రి అగ్నిప్రమాదం.. ఐదు బైకులు దగ్ధం

**సాయిరాం నగర్ కాలనీలో ఘటన.. నిప్పంటించినట్లు అనుమానాలు**

**సీసీ ఫుటేజ్‌లో తెల్లవారుజామున అనుమానాస్పద వ్యక్తి కదలికలు**

**గండిపేట(క్రైమ్ మిర్రర్):** రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని హైదర్‌షాకోట్ డివిజన్ సాయిరాం నగర్ కాలనీలో అర్ధరాత్రి అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఇంటి వద్ద పార్క్ చేసి ఉంచిన ఐదు ద్విచక్ర వాహనాలకు ఒక్కసారిగా మంటలు అంటుకోవడంతో అవి పూర్తిగా దగ్ధమయ్యాయి. బైక్‌లలో పెట్రోల్ ఉండటంతో మంటలు వేగంగా వ్యాపించి భారీగా ఎగిసిపడ్డాయి. దట్టమైన పొగలు అలుముకోవడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. మంటలను గమనించిన పలువురు అప్రమత్తమై సురక్షితంగా బయటకు వచ్చారు. అదృష్టవశాత్తూ ప్రాణనష్టం జరగలేదు. బైక్‌లకు మంటలు అంటుకున్న తీరు నేపథ్యంలో ఎవరో కావాలనే నిప్పంటించి ఉండవచ్చనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ లేదా ఇతర కారణాల వల్ల ప్రమాదం జరిగి ఉండే అవకాశాన్ని కూడా పోలీసులు పరిశీలిస్తున్నారు. ఘటనకు సంబంధించి సీసీ కెమెరా ఫుటేజ్‌ను పోలీసులు పరిశీలిస్తున్నారు. తెల్లవారుజామున సుమారు 3.30 గంటల సమయంలో గుర్తుతెలియని వ్యక్తి అక్కడి నుంచి వెళ్లినట్లు సీసీ ఫుటేజ్‌లో కనిపించినట్లు సమాచారం. దీంతో ఆ వ్యక్తి కదలికలకు అగ్నిప్రమాదానికి ఏమైనా సంబంధం ఉందా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఘటనపై నార్సింగి పోలీసులు కేసు నమోదు చేసి, అగ్నిప్రమాదానికి అసలు కారణాన్ని తేల్చేందుకు విచారణ చేపట్టారు. సీసీ ఫుటేజ్ ఆధారంగా అనుమానితుడిని గుర్తించే ప్రయత్నాలు కొనసాగుతున్నాయి.

